కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి

మెదక్, మెదక్ అర్బన్: సమాజంలో కుల, సామాజిక బహిష్కరణలకు తావు లేదని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను మెదక్‌లోని కలెక్టరేట్‌లో నిర్వహించారు. స్థానిక రాందాస్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ మల్లికార్జున్ గౌడ్, బీసీ అధికారి నాగరాజు గౌడ్, జిల్లా ఇంటర్ విద్యాధికారిణి మాధవి పాల్గొన్నారు.



నమస్కరిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

- కొండా లక్ష్మణ్ బాపూజీ అన్ని వర్గాల సంక్షేమం కోసం పోరాడిన వ్యక్తి అని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి కొనియాడారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన జయంతి వేడుకలను నిర్వహించారు. అదనపు ఎస్పీ మహేందర్, సాయుధ దళ డీఎస్పీ రంగనాయక్, ఎస్బీ సీఐ సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలేందర్, ఏఆర్ ఎస్సైలు భవానీ కుమార్, మహిపాల్ పాల్గొన్నారు.
- త్యాగానికి ప్రతీక కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. రాందాస్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పురపాలక అధ్యక్షుడు చంద్రపాల్, కౌన్సిలర్లు , నాయకులు, పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్: ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక రంగం ఎంతో అభివృద్ధి చెందుతోందని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ధ్రువపత్రాలు అందజేశారు. అనంతరం ఫొటో గ్యాలరీని కలెక్టర్, జిల్లా అధికారులు తిలకించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు, జడ్పీ సీఈవో ఎల్లయ్య, జిల్లా అటవీ అధికారి జోజో, ఇంటర్ విద్యాధికారిణి మాధవి పాల్గొన్నారు.

భారాసను ప్రజలు నమ్మరు: ఎంపీ



మహేశ్‌కు కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మనోహరాబాద్: ప్రజలు భారాస పార్టీని నమ్మే స్థితిలో లేరని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మనోహరాబాద్ భాజపా మండలాధ్యక్షుడు నరేందర్‌చారి ఆధ్వర్యంలో భారాస మండలాధ్యక్షుడు పురం మహేశ్‌తో పాటు ఆయా గ్రామాల ప్రధాన నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ..రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న భారాస ప్రజలు, కార్యకర్తలకు అండగా ఉండకుండా ఆ పార్టీలో ఆధిపత్య పోరు సాగుతుందన్నారు. భాజపా రాష్ట్ర నాయకుడు నత్తి మల్లేశ్, జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, అసెంబ్లీ కన్వీనర్ సాయిబాబా తదితరులున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి

నర్సాపూర్: మెదక్-నర్సాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నందున వాటిని నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి సిబ్బందికి సూచించారు. నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు. సైబర్ మోసాలకు లోనుకాకుండా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ జాన్‌రెడ్డి, ఎస్సై లింగం తదితరులున్నారు.

29న భగీరథ నీటి సరఫరాకు అంతరాయం

నర్సాపూర్, న్యూస్‌టుడే: చక్రియాల నుంచి వచ్చే ప్రధాన పైప్‌లైన్ లీకేజీలకు మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం నుంచి మిషన్ భగీరథ నీటి పథకం పంపింగ్ నిలిచిపోతుందని, ఆదివారం సరఫరా ఉండదని డీఈ రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని ఏడు మండలాలతో పాటు, సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల, జిన్నారం మండలాలకు చెందిన 500 నివాస ప్రాంతాలకు మంజీరా నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

కలుషిత నీరు.. జనం బేజారు..

న్యూస్‌టుడే, మెదక్ టౌన్, నర్సాపూర్, రామాయంపేట, తూప్రాన్

పట్టణాల్లో తాగునీటి శుభ్రతపై పర్యవేక్షణ కరవు

జిల్లా వ్యాప్తంగా సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో తాగునీరు పరిశుభ్రంగా ఉంచాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ప్రజలు రోగాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మెదక్‌తో పాటు నర్సాపూర్, తూప్రాన్, రామాయంపేటలో మొత్తం నాలుగు పురపాలికలు ఉన్నాయి. వీటిలో పట్టణాల స్థాయిలో పలు రకాల పన్నులను ప్రజల నుంచి వసూలు చేస్తున్న యంత్రాంగం అందుకు అనుగుణంగా సదుపాయాలను మాత్రం కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారనే ఆరోపణలు క్షేత్ర స్థాయిలో ఉన్నాయి. దీనిపై 'న్యూస్‌టుడే' కథనం...



ఔరంగాబాద్ పాఠశాల వద్ద ఉన్న ట్యాంకులో నీరు



వాల్వ్ వద్ద మురుగు

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

పైపులు ధ్వంసమై..

- మెదక్ పట్టణంలో ఉన్న ట్యాంకులు: 13
- నీరు సరఫరా అవుతున్న వార్డులు: 29
- రోజువారీ నీటి సరఫరా: 10.5 ఎంఎల్‌డీ(మిలియన్ లీటర్ పర్ డే)
- ఎన్ని రోజులకు శుభ్రం చేయాలి: నెలకు మూడు సార్లు
- పట్టణంలో నీరు సరఫరా పరిధి: 60 కిలోమీటర్లు

పరిశుభ్రత అంతంతే..

- రామాయంపేట పుర పరిధిలో ట్యాంకులు: 19
- పట్టణంలో నీటి సరఫరా పరిధి: 50 కిలోమీటర్లు
- రోజుకు నీటి సరఫరా: 26లక్షల లీటర్లు
- వాటర్ ట్యాంక్‌లు శుభ్రం: చేయడం లేదు.
- క్లోరినేషన్ సైతం: జరగడం లేదు

- ట్యాంకుల వద్ద క్లోరినేషన్ అవుతున్నప్పటికీ ఇంటింటికీ సరఫరా అయ్యే పైపులు తరచూ ధ్వంసమై నీరు లీకేజీ అవుతోంది. వీటి మరమ్మతుల కోసం పురపాలిక ప్రతి నెల రూ. 50 వేల నుంచి రూ. లక్ష వరకు కేటాయిస్తున్నా.. పనులు వెంటనే చేయకపోవడంతో నీరు కలుషితమవుతోంది.
- నెలలో 3 సార్లు ట్యాంకులను శుభ్రం చేస్తున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో అమలుకావడం లేదు.
- ట్యాంకుల్లో నీరు కలుషితమై నురగలు వస్తోంది.
- ట్యాంకుల పై కప్పులను సైతం సరిగా పెట్టక దుమ్మూధూళి నీటిలో కలుస్తోంది.

ట్యాంకుల వద్ద అపరిశుభ్రంగా..

- తూప్రాన్ మున్సిపల్ పరిధిలోని ట్యాంకులు: 26
- నీటి ట్యాంక్ శుభ్రం చేస్తుంది: 15 రోజులకు ఒక్కసారి
- వాటి పరిస్థితి: కొన్నిచోట్ల అపరిశుభ్రంగా..
- క్లోరినేషన్ ప్రక్రియ: 15 రోజులకు ఒకసారి
- 16 వార్డులో కొన్నిచోట్ల పైపుల లీకేజీలతో నీరు కలుషితమవుతోంది. మరికొన్ని చోట్ల ట్యాంకుల వద్ద అపరిశుభ్రత నెలకొంది. నిబంధనల కంటే తక్కువ సార్లు ట్యాంకులను శుభ్రం చేస్తున్నారు.

సరఫరాలో సమస్యలు

- నర్సాపూర్ మున్సిపల్ పరిధిలో ఉన్న ట్యాంకులు: 15
- వాటర్ ట్యాంకు శుభ్రం చేస్తున్నారా?: అవును
- క్లోరినేషన్ ప్రక్రియ: హత్నూర మండలం బోర్పట్ల వద్ద ఉన్న ఫిల్టర్ బెడ్ వద్ద జరుగుతోంది.
- పట్టణంలో నీరు సరఫరా పరిధి: 48కి.మీలు
- రోజువారీ నీటి సరఫరా: 2.4ఎంఎల్‌డీ
- 10వ వార్డులో పైప్‌లైన్ మరమ్మతులకు తవ్వి వదిలేశారు. దీంతో మురుగు చేరి నీరు కలుషితమవుతోంది.



మరమ్మతులకు తవ్వి వదిలేసి..

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

నర్సాపూర్: లోక్ అదాలత్‌ల ద్వారా కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందని న్యాయమూర్తి అనిత సూచించారు. నర్సాపూర్‌లోని జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో శుక్రవారం ఆమె మాట్లాడారు. ఆబ్కారీ, బ్యాంకు, పోలీస్ కేసుల్లో రాజీకుదుర్చుకోవచ్చని తెలిపారు. సీఐ జాన్ రెడ్డి, ఎస్సైలు లింగం, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెదక్ అర్బన్: రాజీ మార్గంలో కేసులు సులువుగా పరిష్కారమవుతాయని, ఈనెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించుకోవాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి జితేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మెజిస్ట్రేట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ అర్బన్: నర్సాపూర్‌లో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ పోస్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలను మెదక్‌లోని జిల్లా కోర్టు నోటీసు బోర్డులో పొందుపరచామన్నారు.

రికార్డుల నిర్వహణ తప్పనిసరి

హవేలీఘనపూర్, న్యూస్‌టుడే: రికార్డులు తప్పని సరిగా నిర్వహించాలని జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. శుక్రవారం హవేలీఘనపూర్ ఎంపీడీవో కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో రవీశ్వర్ గౌడ్, సిబ్బంది ఉన్నారు.

పర్యాటక రంగంపై సర్టిఫికెట్ కోర్సు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో పర్యాటక రంగంపై 40 రోజుల సర్టిఫికెట్ కోర్సును అందించనున్నట్లు చరిత్ర విభాగాధిపతి గణపతి తెలిపారు. శుక్రవారం ఆయన ఆర్ట్స్ క్యాంపస్‌లో మాట్లాడుతూ.... స్వయం ఉపాధి పొందేలా ఈ కోర్సు ఉంటుందన్నారు. కోర్సుకు సంబంధించిన గోడపత్రికలను అదనపు ఎస్పీ మహేందర్ ఆవిష్కరించారు. కళాశాల అధ్యాపకులు వెంకటేశ్వర్లు, మల్లేశం, రాజాగౌడ్ తదితరులు ఉన్నారు.



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న ఏఎస్పీ మహేందర్, అధ్యాపకులు


బారులు తీరే.. బాధలు తీర్చండి!

హవేలీఘనపూర్, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెదక్ జిల్లా హవేలీఘనపూర్ ఉన్నత పాఠశాలలో 540 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇందులో 230 మంది బాలికలు ఉన్నారు. బాలికలకు ఒకే శౌచాలయం ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విరామ సమయంలో శౌచాలయానికి ఒక్కొక్కరు వెళ్లాల్సి రావడంతో తరగతులకు హాజరుకాలేకపోతున్నామని వాపోతున్నారు. బాలుర శౌచాలయాలకు నీటి సరఫరా లేకపోవడంతో వారు ఆరు బయటకు వెళ్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సరిపడా శౌచాలయాలు నిర్మించాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.



పర్యావరణ హితం.. వృత్తి నైపుణ్యం!

● విద్యార్థులకు ఎల్‌ఈడీ దీపాల తయారీపై శిక్షణ



విద్యార్థి దశలోనే వృత్తి నైపుణ్యాలు పెంపొందిస్తూ.. పర్యావరణ హితం వైపు యోచించేలా జాతీయ హరిత దళం (ఎన్‌జీసీ) సంకల్పించింది. చిట్టి బుర్రలకు పదును పెట్టేలా.. కార్యాచరణ అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎల్‌ఈడీ దీపాల తయారీ శిక్షణకు శ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా ఒక్కో జిల్లాకు పాఠశాలలను ఎంపిక చేసి తర్ఫీదు ఇస్తోంది. జిల్లా స్థాయిలో ఒక రోజు కార్యశాల చేపడుతోంది. సంగారెడ్డిలో 23, సిద్దిపేటలో 26 తేదీలలో నిర్వహించారు.

న్యూస్‌టుడే, సంగారెడ్డి మున్సిపాలిటీ, సిద్దిపేట

200 పాఠశాలల్లో అమలు

జాతీయ హరితదళం ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఎల్‌ఈడీ దీపాల తయారీపై శిక్షణకు ఒక్కో జిల్లాకు 50 చొప్పున 200 పాఠశాలలను ఎంపిక చేశారు. ఒక్కో బడిలో సైన్స్ ఉపాధ్యాయుడు, ముగ్గురు విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చారు. ఎల్‌ఈడీ దీపం తయారీపై అవగాహన కల్పించారు. రాష్ట్రస్థాయి సమన్వయకర్త రాజశేఖర్ ఆధ్వర్యంలో నిపుణులు విద్యార్థులకు వివరిస్తున్నారు. పిల్లలతో వాటిని రూపొందింపజేస్తూ అవగాహన కల్పిస్తున్నారు. తయారు చేసిన బల్బులు పాఠశాల, ఇంటి వద్ద వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నారు. బాధ్యతను ప్రధానోపాధ్యాయులకు అప్పగించారు.

అన్ని పాఠశాలల్లో..



ప్రస్తుతం నాలుగు జిల్లాల్లో ఎంపిక చేసిన పాఠశాలల్లో శిక్షణ ఇస్తున్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు నేర్పించాలని నిర్ణయించారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ (ఎకో) క్లబ్‌లు ఏర్పాటయ్యాయి. కేంద్ర ప్రభుత్వం నేతృత్వంలో లైఫ్ స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ (ఎల్‌ఐఎఫ్‌ఈ) థీమ్‌గా ఎంచుకొని ఏడు అంశాలను అమలు చేయనున్నారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఎల్‌ఈడీ దీపాల తయారీపై ప్రత్యేకంగా దృష్టిసారించారు.

ఎల్‌ఈడీ ప్రయోజనాలు ఇలా..

● 90 శాతం విద్యుత్తు ఆదా. ● ఎక్కువ కాలం మన్నిక, దృఢంగా ఉంటాయి. ● ఉత్పత్తి చేసేందుకు తక్కువ ఖర్చవుతుంది. ● తయారీ ఖర్చు తక్కువ. ● ఉద్గారాలు తక్కువ శాతం వెలువడతాయి.

వాడే వస్తువులు, తయారీ

బల్బు తయారీకి ఎల్‌ఈడీ స్ట్రిప్, బీసీబీ, ట్రాన్స్‌ఫార్మర్, రెసిస్టర్, డయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్‌ను వాడుతారు. ముందుగా ఎల్‌ఈడీ స్ట్రిప్ పైభాగాన్ని తీసుకోవాలి. అందులో రెసిస్టర్, డయాడ్, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సహాయంతో అన్ని భాగాలను బిగించాలి. 230 వాట్స్ ఉన్న విద్యుత్తును ఆటోమేటిక్‌గా 10 వాట్స్‌కు మార్చుకుంటుంది.

ఉత్సాహంగా నేర్చుకున్నా:



ఎల్‌ఈడీ ట్యూబ్‌లైట్ల తయారీని ఉత్సాహంగా నేర్చుకున్నా. అధికారులు చక్కగా అవగాహన కల్పించారు. నేను ఓ ట్యూబ్ లైట్ తయారుచేశా. కేవలం రూ.వంద ఖర్చయ్యింది. దాన్ని పాఠశాలలోని ఓ గదిలో వినియోగిస్తున్నాం.

సహస్ర, విద్యార్థిని ఎద్దుమైలారం

సత్ఫలితాలు:

జపాన్ వంటి దేశాల్లో ఎలక్ట్రానిక్ ఉత్పత్తి తయారు చేసే కుటీర పరిశ్రమలెన్నో ఉన్నాయి. ఇందుకు దీటుగా భారత్ తయారు కావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. నైపుణ్యం పెంపొందిస్తే ఉపాధి సులువుగా లభిస్తుంది. విద్యార్థి దశ నుంచే అలవర్చడం ద్వారా సత్ఫలితాలు ఉంటాయి.

బేతి భాస్కర్, జిల్లా ఎన్‌జీసీ సమన్వయకర్త, సిద్దిపేట

గగనతలంలో శిక్షణ..

లక్ష్య సాధనకు తపన

న్యూస్‌టుడే, సిద్దిపేట, సిద్దిపేట టౌన్

ఆసక్తి, ధైర్యానికి సాధన తోడైతే లక్ష్య సాధన పెద్ద కష్టమేమి కాదని నిరూపించారు సిద్దిపేట స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి నిరంజన్‌రెడ్డి. గగనతలంలో ప్రాథమిక శిక్షణ విజయవంతంగా పూర్తి చేశారు. బీకామ్ కంప్యూటర్స్ (తృతీయ) చదువుతున్న ఇతడి స్వస్థలం దౌల్తాబాద్ మండలం గాజులపల్లి. తల్లిదండ్రులు లత, బ్రహ్మానందరెడ్డి. వ్యవసాయ కుటుంబం. ఆర్మీలో చేరాలనే తలంపుతో ప్రథమ సంవత్సరంలోనే ఎన్‌సీసీలో చేరారు. త్రివిధ దళాల్లో కొలువే లక్ష్యంగా అడుగేసిన నిరంజన్‌రెడ్డి.. వాయుసేన ఆధ్వర్యంలో కొనసాగిన 23 రోజుల పారా బేసిక్ కోర్సు పూర్తి చేశారు. ఆగ్రాలో ఈ నెల 2 నుంచి 24 వరకు శిబిరం కొనసాగగా, కరీంనగర్ బెటాలియన్ నుంచి పాల్గొన్నది ఇతనొక్కడే కావడం విశేషం. పారా బేసిక్.. వాయుసేన విభాగంలో ప్రాథమిక స్థాయి శిక్షణ ఇచ్చే కోర్సు. దీనికి 175 మంది ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల నుంచి ఎన్‌సీసీ కేడెట్లు 50 మంది పాల్గొన్నారు. శిక్షణను పూర్తి చేసుకొని ధ్రువపత్రం అందుకున్న కేడెట్‌ను వైస్ ప్రిన్సిపల్ డా. పి. అయోధ్యరెడ్డి, ఎన్‌సీసీ అధికారి కెప్టెన్ భవాని, ఏవో సులేమాన్ అభినందించారు.



నిరంజన్‌రెడ్డి

శిక్షణ సాగిందిలా..

తొలుత టేబుల్ (3 పీట్ల ఎత్తు) నుంచి దూకడం, నిలదొక్కుకునే తీరుపై మెలకువలు నేర్పించారు. కదిలే చక్రాలపై 9 అడుగుల ఎత్తు నుంచి దూకడం, తర్వాత 11 అడుగుల ఎత్తుపై నుంచి ప్యారాచూట్ ఆధారంగా దూకడం, గగనతల ప్రయాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దూకే ముందు పాటించాల్సినవి నేర్పించారు. 12 రోజుల తర్వాత 30 అడుగుల ఎత్తు నుంచి దూకడాన్ని (ఫ్యాన్ టెస్టు) పరీక్షించారు. ఒకరోజు ఎరోప్లేన్‌లో 4 గంటలు ప్రయాణించారు. శిక్షణలో 15 రోజులు పూర్తయ్యాక రోప్లేన్ నుంచి నేరుగా దూకడం (1250 అడుగుల ఎత్తు) మొదలవుతుంది. 'ప్రారంభంలో కొంత భయమేసినా నిత్యం సాధనతో గొప్ప అనుభూతి కలిగింది. ఆర్మీలో ఉన్నత ఉద్యోగమే లక్ష్యమ'ని చెబుతున్నారు నిరంజన్‌రెడ్డి.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ

పాపన్నపేట: ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణతో పాటు దేశభక్తి పెంపొందుతుందని 33(టీ) సంగారెడ్డి యూనిట్ ఆర్మీ కమాండింగ్ అధికారి రమేష్ సరియల్ పేర్కొన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాల ఎన్‌సీసీ కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సీసీ ధ్రువపత్రాలతో పోటీ పరీక్షల్లో మేలు కలుగుతుందని చెప్పారు. హెచ్‌ఎం మహేశ్వర్, సీటీవో ప్రవీణ్ కుమార్, తదితరులున్నారు.



సూచనలు చేస్తున్న రమేష్ సరియల్

మహనీయులను ఆదర్శంగా తీసుకోండి



వార్షిక నివేదికను ఆవిష్కరిస్తున్న వీసీ నీరజ ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్ రాములు తదితరులు

ములుగు, న్యూస్‌టుడే: మహనీయుల జీవితాలను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వీసీ నీరజా ప్రభాకర్, బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, ప్రముఖ రచయిత బి.ఎస్.రాములు ఆకాంక్షించారు. శుక్రవారం ములుగులోని కొండా ఉద్యాన విశ్వవిద్యాలయం పరిపాలనా విభాగం కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడారు. విద్యార్థులు ఇప్పుడు కష్టపడితే భవిష్యత్తు బాగుంటుందన్నారు. దేశం కోసం, ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కొండా లక్ష్మణ్ చేసిన సేవలను స్మరించుకున్నారు. అనంతరం విశ్వవిద్యాలయం 8వ వార్షికోత్సవ నివేదిక పుస్తకాన్ని ఆవిష్కరించారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు రాజశేఖర్, సురేష్‌కుమార్, సుచిత్ర, చీనా, ప్రశాంత్, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రమిస్తే విజయం ఖాయం



విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: విద్యార్థి స్థాయి నుంచే సృజనాత్మక శైలిని అలవర్చుకుంటే ఉన్నతంగా ఎదగవచ్చని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ సూచించారు. శుక్రవారం మెదక్ జిల్లా హవేలిఘనపూర్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. 6 నుంచి 9 తరగతి వరకు విద్యార్థులతో మాట్లాడి వారి సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మండల స్థాయి కళా ఉత్సవ్ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు తమ ప్రతిభ చాటుకునేందుకు కళా ఉత్సవ్ పోటీలు చక్కటి వేదికన్నారు. శ్రమిస్తే విజయం ఖాయమని చెప్పారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. అనంతరం హవేలిఘనపూర్ శివారులోని డైట్ కళాశాలను పరిశీలించారు. అక్కడి సౌకర్యాలు, సిబ్బంది గురించి డైట్ ప్రిన్సిపల్ రమేష్‌బాబును అడిగి తెలుసుకున్నారు. ఉర్దూ మాధ్యమంలో 100 సీట్లు కేటాయించాలని, అధ్యాపకులను నియమించాలని మహ్మద్ రియాజుద్దీన్.. రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. డీఈవో రాధాకిషన్, ఎంఈవోలు నీలకంఠం, మధుమోహన్, హెచ్ఎంలు కరుణాకర్, నాగుల్‌మీరా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రైవేట్ యాప్‌లతో జాగ్రత్త



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్ బాబు

న్యూస్‌టుడే, మెదక్ టౌన్: అనవసరమైన ప్రైవేట్ యాప్‌ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ట్రాయ్ సంయుక్త సలహాదారు సురేష్ బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్‌లోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రుణ యాప్‌లతో జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. సీ-డీఏసీ ప్రాజెక్టు మేనేజర్ జగదీష్ బాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాదేవి, ట్రాయ్ సీనియర్ రీసెర్చ్ అధికారి వెంకటపతి, వైస్ ప్రిన్సిపల్ విజయలక్ష్మి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దాంపత్యానికి 'ఆదర్శం' తోడూనీడ

పూలదండల మార్పిడి, ప్రమాణ స్వీకారంతో వివాహం పూర్తి



నూతన దంపతులు శ్రీకాంత్, స్వేచ్ఛ, పార్టీ, సంఘం నేతలు

సిద్దిపేట అర్బన్, న్యూస్‌టుడే: ఆడంబరాలకు దూరంగా యువతి, యువకుడు శుక్రవారం సిద్దిపేటలో ఆదర్శ వివాహం చేసుకున్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, తెలంగాణ విశ్వవిద్యాలయం విద్యార్థిని స్వేచ్ఛ.. సిద్దిపేట పట్టణంలోని విపంచి కళానిలయంలో ఆదర్శ వివాహంతో ఒక్కటయ్యారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జేవీ చలపతిరావు పూలదండలు మార్పించి, ప్రమాణ పత్రం చదివించారు. హాజరైన సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర కార్యదర్శి సూర్యం మాట్లాడారు. కుల, మత సంప్రదాయాలు ప్రజల మధ్య వ్యత్యాసాలను పెంచుతోందన్నారు. వివాహాలను ఆడంబరంగా చేస్తూ పేద, మధ్యతరగతి ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. దానికి భిన్నంగా శ్రీకాంత్-స్వేచ్ఛలు ఆదర్శ వివాహం చేసుకొని సమాజానికి సవాల్ విసిరారన్నారు. యువ జంటను నాయకులు ఆశీర్వదించారు.

చికెన్ ధరలు		
ఫాంరేటు 125-00	డ్రెస్డ్	213-00
రిటైల్ 147-00	స్కిన్‌లెస్	243-00

ఆవిర్భావ దినోత్సవం.. పోటెత్తిన భక్తజనం



మెదక్ పట్టణంలో భక్తుల భారీ ర్యాలీ



సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ప్రారంభిస్తున్న డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా.కె.రూబెన్ మార్క్, మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య



చర్చి ప్రాంగణంలో శిలువ ఊరేగింపు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: చర్చి ఆఫ్ సౌత్ ఇండియా కూటమి, స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావ వేడుకలను శుక్రవారం మెదక్‌లోని సీఎస్ఐ చర్చి ఘనంగా నిర్వహించారు. మెదక్ డయాసిస్ పరిధి ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సంఘాల జెండాలను ఆవిష్కరించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళల కోలాటాలు, యువత నృత్యాల మధ్య భారీ ర్యాలీ కొనసాగింది. శిలువను ప్రార్థనా మందిరంలో ప్రతిష్ఠించగా, డిప్యూటీ మాడరేటర్, మెదక్ ఇన్‌ఛార్జి బిషప్ డా. కె. రూబెన్ మార్క్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆరాధనలు చేపట్టారు. దైవ సందేశం వినిపించారు. స్త్రీ మైత్రి సంఘం ఆవిర్భావాన్ని పురస్కరించుకొని బిషప్ సతీమణి కె.ప్రిసిల్లా పరిమళ రూబెన్ మార్క్ జ్యోతి వెలిగించారు. భక్తబృందం పాటలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

● చర్చి ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన భవనంలో సీఎస్ఐ మిషన్ ఆసుపత్రిని ఇన్‌ఛార్జి బిషప్.. మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్యతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. సీఎస్ఐ సంఘం విశ్వసనీయత, విశిష్టతతో కూడుకున్నదని తెలిపారు. మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు వేడుకల్లో పాల్గొన్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. డయాసిస్ లే సెక్రటరీ ప్రభు కిరణ్, వైస్ ఛైర్మన్ విన్‌స్టన్, విమల్ సుకుమార్, జయానంద్, విల్సన్, సాల్మన్, గంట సంపత్, సాంసన్ సందీప్, స్టువర్ట్ ఫ్రాంక్ జాన్సన్, సువాన్ డగ్లస్, జోయల్, ఉమెన్ ప్రెసిడెంట్ ఎలిజబెత్, సెక్రటరీ ఇందిర తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనా మందిరంలో భక్తులు

ఐదునెలల్లోనే రూ.28.85 కోట్ల లాభాలు



సిద్దిపేటలో ఉద్యోగినికి ప్రశంసాపత్రం అందిస్తున్న ఆర్‌ఎం ప్రభులత, డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎనిమిది డిపోలు కేవలం ఐదు నెలల వ్యవధిలో రూ.28.85 కోట్ల లాభాలు ఆర్జించాయని మెదక్ రీజినల్ మేనేజర్ ప్రభులత అన్నారు. రాష్ట్రస్థాయిలో సిద్దిపేట ఆర్టీసీ డిపో లాభాల ఆర్జనలో తృతీయ స్థానం పొందిన నేపథ్యంలో శుక్రవారం సిద్దిపేటలో ఉద్యోగులు, సిబ్బంది అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్‌ఎం 400 మంది డిపో ఉద్యోగులు, సిబ్బందికి బహుమతులు అందజేశారు. అనంతరం డీఎం సుఖేందర్‌రెడ్డితో కలిసి ఆమె మాట్లాడారు. ప్రగతిచక్రం అవార్డు, రూ.2 లక్షల పురస్కారం రావడం సంతోషంగా ఉందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే మూడు నెలలు పెళ్లిళ్లు, పండగల సీజన్‌లో మెరుగైన లాభాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రతి నెలా ఇచ్చే ప్రగతి చక్రం అవార్డులను అందరూ అందుకోవాలని ఆకాంక్షించారు. ఆర్టీసీకి డ్రైవర్లు, కండక్టర్లే బ్రాండ్ అంబాసిడర్లని, ప్రయాణికుల పట్ల మర్యాదగా మెలగాలని సూచించారు. సర్వీసుల సంఖ్య పెంచే యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. అనంతరం ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించి లక్కీడిప్ ద్వారా ఎంపికైన ముగ్గురికి బహుమతులు అందజేశారు డిపో అసిస్టెంట్ మేనేజర్ మహేశ్వరి, దుబ్బాక ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి కనకలక్ష్మి, సిబ్బంది మౌలానా, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

అనిశాకు చిక్కిన పంచాయతీ కార్యదర్శి

● రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



షకీల్

సంగారెడ్డి అర్బన్, కొండాపూర్, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటరు పేరు మార్పిడికి అవసరమయ్యే ధ్రువపత్రం మంజూరు చేసేందుకు రూ.5వేలు లంచం తీసుకుంటూ పంచాయతీ కార్యదర్శి ఎండీ షకీల్ అవినీతి నిరోధక శాఖ(అనిశా) అధికారులకు చిక్కాడు. ఈ ఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా కొండాపూర్‌లో చోటుచేసుకుంది. అనిశా డీఎస్పీ కె.సుదర్శన్ తెలిపిన వివరాలు.. కొండాపూర్‌కు చెందిన మాచేపల్లి అప్సర్ అదే గ్రామానికి చెందిన జి.దశరథ్‌కు చెందిన ఇంటిని రెండేళ్ల క్రితం కొనుగోలు చేశారు. ఆ ఇంటికి సంబంధించిన విద్యుత్తు మీటరును తన పేరుపైకి మార్చుకునేందుకు విద్యుత్తు శాఖకు గ్రామ పంచాయతీ నుంచి జారీ చేసిన ధ్రువపత్రం అందజేయాలి. ఇందుకోసం రెండేళ్ల నుంచి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నాడు. డబ్బులు ఇవ్వనిదే పని చేయలేమని ఇటీవల పంచాయతీ కార్యదర్శి షకీల్ స్పష్టం చేశాడు. ఇందుకోసం తొలుత రూ.25 వేలు డిమాండ్ చేసిన కార్యదర్శి.. చివరకు రూ.7వేలకు ఒప్పుకొన్నాడు. ఈ విషయంపై అనిశా అధికారులు అప్సర్ సమాచారమిచ్చాడు. కొండాపూర్‌లోని కార్యాలయంలో అప్సర్ నుంచి రూ.5 వేలు లంచం తీసుకుంటున్న పంచాయతీ కార్యదర్శిని అనిశా అధికారులు పట్టుకున్నారు. అధికారులు లంచం డిమాండ్ చేస్తే టోల్ ఫ్రీ నంబర్-1064కు ఫిర్యాదు చేయాలని డీఎస్పీ కోరారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనిశా సీఐలు వెంకటేశ్వర్లు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సులో మాయమైన రూ.4.50లక్షలు స్వాధీనం!

కౌడిపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో మాయమైన రూ.4.50లక్షల నగదును పోలీసులు వారం రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటకు చెందిన మహమ్మద్ రఫీ, రెహనా బేగం దంపతులు ఈనెల 19న మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా షాపుర్‌నగర్ నుంచి కామారెడ్డి డిపోనకు చెందిన బస్సులో ప్రయాణిస్తుండగా.. కౌడిపల్లిలో నగదు ఉన్న సంచి మాయమైంది. దీనిపై స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిఘా కెమెరాలు, ఇతర మార్గాల్లో ఆ రోజు బ్యాగుతో సహా బస్సులో నుంచి దిగిపోయిన మహిళను గుర్తించారు. వారం రోజులు శ్రమించి మహిళను పట్టుకొని.. రూ.4.50 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. కొల్చారం మండలం పోతిరెడ్డిపల్లి తండాకు చెందిన మహిళగా గుర్తించినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. స్థానిక ఎస్సై రంజిత్ రెడ్డిని వివరణ కోరగా.. నగదు స్వాధీనం చేసుకున్నామని, వివరాలు త్వరలోనే వెల్లడిస్తామన్నారు.

వనదుర్గమ్మను వీడని గంగమ్మ..



రాజగోపురంలో దర్శనమిస్తున్న దుర్గమ్మ



ఆలయం ముందు వరద ప్రవాహం

పాపన్నపేట, న్యూస్‌టుడే: సింగూరు ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గామాత ఆలయం వద్ద నాలుగు రోజులుగా వరద కొనసాగుతోంది. శుక్రవారం వరద మరింత పెరగడంతో అర్చకులు కూడా అక్కడికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. భక్తుల సౌకర్యార్థం రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగాయి. వనదుర్గా ప్రాజెక్టు నుంచి 22,000 క్యూసెక్కుల వరదనీరు దిగువకు ప్రవహిస్తున్నట్లు ప్రాజెక్టు ఏఈఈ విజయ్ కుమార్ తెలిపారు.

వేధింపులు తట్టుకోలేకపోతున్నా..



ఉదయ్‌కుమార్

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: 'పోలీసులు, ప్రేమించి పెళ్లి చేసుకున్న యువతుల తల్లిదండ్రుల వేధింపులు భరించలేకపోతున్నా. అమ్మానాన్న నన్ను క్షమించండి. నేను చనిపోతున్నా' అంటూ ఓ యువకుడు లేఖ రాసి, సెల్ఫీ వీడియో తీసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులు, లేఖ, సెల్ఫీ వీడియోలో ఉన్న వివరాలు.. అనంతపురం జిల్లా కదిరి మండలం యర్రదొడ్డికి చెందిన ఉదయ్‌కుమార్(35) శుక్రవారం గ్రామ సమీపంలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గతంలో కదిరిలో సీఐగా పని చేసిన మధు, తెలంగాణ రాష్ట్రం సిద్దిపేట సీఐ శ్రీనివాస్ వేధింపులతోనే బలవన్మరణానికి పాల్పడుతున్నట్లు అందులో పేర్కొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున చెట్టుకు వేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. ఉదయ్ కుమార్ సిద్దిపేటలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేశాడు. మూడేళ్ల కిందట అదే ప్రాంతానికి చెందిన బాలికను ప్రేమించి, కదిరికి తీసుకొచ్చి పెళ్లి చేసుకున్నాడు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదుతో అతనిపై సిద్దిపేట, కదిరిలో కేసు నమోదైంది. పోలీసులు యువకుడితోపాటు అతడి సోదరుడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికను కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తమ కుమారుడిని తీవ్రంగా కొట్టడంతో వినికిడి కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపించారు.


న్యాయస్థానంలో ఫిర్యాదు: ఉదయ్‌కుమార్ జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించి పోలీసులపై ఫిర్యాదు చేయగా పోలీసులపై కేసు నమోదైంది. ఆ కోపంతో పోలీసులు తమతోపాటు కుమారుడిని వేధించారని కుటుంబసభ్యులు తెలిపారు. కేసును వెనక్కి తీసుకోవాలని, తెల్ల కాగితాలపై సంతకాలు చేయాలంటూ హింసించారని అప్పటి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ విక్టర్‌ప్రసాద్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. పోలీసుల వేధింపులతో ఉదయ్ తెలంగాణలోనే ఉండిపోయాడని వాపోయారు. సిద్దిపేట బాలిక దూరమయ్యాక అతడు తెలంగాణలోని భద్రాచలం, హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన ఇద్దరు యువతులను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వివిధ కారణాలతో వారు దూరమయ్యారు. ఈ ఘటనలతో జీవితంపై విరక్తి చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు ఇన్‌ఛార్జి సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

ఢీకొన్న ఇంజినీరింగ్ కళాశాల బస్సులు

● ప్రమాదంలో డ్రైవర్ మృతి ● దాదాపు 30మంది విద్యార్థులకు గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన రెండు బస్సులు



నాగరాజు

నర్సాపూర్, న్యూస్‌టుడే: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన రెండు బస్సులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒక డ్రైవర్ మృతి చెందాడు. మరో డ్రైవర్‌తో పాటు దాదాపు 30మంది విద్యార్థులు, అధ్యాపకులకు గాయాలైన ఘటన మెదక్ జిల్లా నర్సాపూర్‌లో శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సు.. విద్యార్థులను తీసుకురావడానికి నర్సాపూర్‌కు వెళుతోంది. హైదరాబాద్ నుంచి విద్యార్థులు, అధ్యాపకులతో వస్తున్న మరో బస్సు కళాశాలకు అతి సమీపంలో ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో రెండు బస్సుల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. ఇద్దరు డ్రైవర్లు వాటిలో ఇరుక్కుపోయారు. విద్యార్థులతో వస్తున్న బస్సులో సుమారు 30 మంది వరకు ఉండగా.. వారందరికీ స్వల్ప గాయాలయ్యాయి. బస్సుల అద్దాలు పగలడంతో ముందు కూర్చున్న విద్యార్థులకు గాజు పెంకులు గుచ్చుకొని గాయాలయ్యాయి. కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది, పోలీసులు ప్రమాద స్థలికి చేరుకొని గాయపడిన వారిని సంగారెడ్డి, నర్సాపూర్ ఆసుపత్రులకు తరలించారు. బస్సుల్లో ఇరుక్కుపోయిన ఇద్దరు డ్రైవర్లను అతికష్టం మీద బయటకు తీశారు. డ్రైవర్ నాగరాజు(56)ను నర్సాపూర్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మరో డ్రైవర్ యాదగిరిని హైదరాబాద్‌కు తరలించారు. ఉదయం ప్రమాదం జరగడంతో కిలోమీటర్ల దూరం వరకు వాహనాలు నిలిచిపోయాయి. మృతి చెందిన డ్రైవర్ నాగరాజు స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా తాడిపత్రి కాగా.. పటాన్‌చెరులో స్థిరపడ్డారు. మృతుడు నాగరాజు భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై లింగం చెప్పారు.


ప్యారారం శివారులో పత్తి పంట పరిశీలిస్తున్న గోవింద్

పంటల రక్షణతో అధిక దిగుబడులు

రేగోడ్, అల్లాదుర్గం: సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తేనే మంచి దిగుబడులు వస్తాయని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ అన్నారు. అల్లాదుర్గం మండలంలోని బహిరన్ దిబ్బ, ప్యారారం శివారులో పత్తి, ఉల్లి పంటను శుక్రవారం పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పూత, కాత రాలిపోవడం జరిగిందన్నారు. ఉల్లి పంటలో ఎండు తెగులు ఆశించకుండా కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త విజయకుమార్, పాలిషా, సరిత, విజయ్, ఏఈవోలు ఉన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు రాయితీ

హవేలిఘనపూర్, న్యూస్‌టుడే: ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు మొగ్గు చూపేలా చర్యలు తీసుకోవాలని డీఆర్‌డీవో పీడీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందికి అవగాహన కల్పించి మాట్లాడారు. రాయితీపై ప్రభుత్వం అందించే పథకాల గురించి రైతులకు వివరించి, అమలు చేయాలని సూచించారు. ఏపీవో లక్ష్మణ్, టీఏలు పణీంద్ర, సతీష్ తదితరులున్నారు.

చీడపీడల నివారణ

నర్సాపూర్ రూరల్: వరి పంటకు సోకిన చీడపీడలను గుర్తించి సకాలంలో నివారణ మందులను పిచికారీ చేసుకోవాలని ఏడీఏ సంధ్యారాణి అన్నారు. మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో రైతు రామ్‌మనోహర్ సాగుచేసిన వరి పంటను శుక్రవారం ఆమె పరిశీలించి పంటకు కాండం కుళ్లు తెగులు సోకినట్లు గుర్తించారు. అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. ఏవో దీపిక, ఏఈవో చంద్రవేణి ఉన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్


విద్యార్థులతో మాట్లాడుతున్న రమేష్

మెదక్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని అవుసులపల్లి ప్రాథమికోన్నత పాఠశాల, మాచవరం ఉన్నత పాఠశాలను ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గాజర్ల రమేష్ శుక్రవారం తనిఖీ చేశారు. ఎల్‌ఐపీ ప్యానెల్స్ ఉపయోగం, ఎన్‌ఏఎస్ ఫలితాలు, ఎల్ఓపీ బేస్‌లైన్ టెస్ట్ ఫలితాలను పరిశీలించి, ఉపాధ్యాయ బృందంతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులను పలు పాఠ్యాంశాలపై ప్రశ్నించారు. జిల్లా విద్యాధికారి రాధాకిషన్, ఎంఈవో నీలకంఠం తదితరులు ఉన్నారు.

నీటి నిల్వ గుంతల నిర్మాణం.. రైతులకు ప్రయోజనం

న్యూస్‌టుడే, శివ్వంపేట, వెల్దుర్తి, కౌడిపల్లి, పాపన్నపేట

జాతీయ ఉపాధి హామీ పథకం నిధుల ద్వారా పంట పొలాల్లో నీటి నిల్వ గుంతల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రెండేళ్ల క్రితం ఇది అమల్లోకి వచ్చింది. ఇందులో భాగంగా పంట పొలాల్లో, బోరుబావి సమీపంలో పెద్దగుంతలు తవ్వుతారు. గుంతల్లో నీరు ఉండటంతో ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయి. వీటితో పంటపొలాల్లో పెంపకం అభివృద్ధికి ఉపాధి హామీ ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో అన్నదాతలను ప్రోత్సహిస్తున్నారు. గుంతల్లో చేపల పెంపకం వంటివి చేయవచ్చు. గుంత సైజు ఆధారంగా కనిష్ఠంగా రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు ఇవ్వనున్నారు.


కుర్తివాడలో గుంత తవ్వుతున్న కూలీలు

ఆయాచోట్ల పనుల జోరు

శివ్వంపేట మండలంలో 37 పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో నీటి గుంతలు నిర్మించుకోవడానికి రైతులు ముందుకొచ్చారు. మండలంలో 150 నీటి నిల్వ గుంతల నిర్మాణం లక్ష్యం కాగా ప్రస్తుతం 21 గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. ఉమ్మడి వెల్దుర్తి మండలంలో పండ్ల తోటలను ఉపాధి పథకం కింద నాటేందుకు 50 ఎకరాల్లో లక్ష్యం కాగా ఇప్పటి వరకు 40 ఎకరాల్లో పండ్ల తోటల సాగు చేపట్టారు. పాపన్నపేట మండలంలో ఇప్పటివరకు 20 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో భాగంగా కుర్తివాడ, అర్కెల, పాతలింగాయిపల్లి, పొడ్చన్‌పల్లి గ్రామాల్లో మొత్తం 8 నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. ఆసక్తి ఉన్న రైతులు ఉపాధి హామీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. కౌడిపల్లి మండలంలో 25పంచాయతీలో పనులు జరుగుతున్నాయి.

నీటి నిల్వలతో బహుళ ప్రయోజనాలు

– అనిల్ కుమార్, ఉపాధిహామీ ఏపీవో, శివ్వంపేట

నీటిగుంతల నిర్మాణంతో భూగర్భ జలాల అభివృద్ధి, సాగుకు ఉపయోగపడుతుంది. చేపల పెంపకం ద్వారా అదనంగా ఆదాయం పొందవచ్చు. ఒక్కో నీటి నిల్వ గుంత నిర్మాణానికి ఉపాధి కూలీలకు సుమారు రూ.3లక్షలు వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. మరిన్ని వివరాలకు రైతులు పంచాయతీ కార్యదర్శిని సంప్రదించాలి.


కౌడిపల్లిలో ..

జీవో-25ను ఉపసంహరించాలి: టీపీటీఎఫ్



మాట్లాడుతున్న కొండల్‌రెడ్డి

మెదక్, కొల్చారం: ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవో-25 వెంటనే ఉపసంహరించుకోవాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కొండల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం భవనంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు సంగయ్య మాట్లాడుతూ..నూతన మండల విద్యాధికారులను ప్రభుత్వం నియమించిన ప్పటిరీ సీనియారిటీని విస్మరించడం సరికాదన్నారు. జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ యాదగిరి, ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ రామ్‌రెడ్డి, జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు నజీరోద్దీన్, యాదగిరి, భాగ్యలక్ష్మి, విఠల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కొల్చారం మండలం రాంపూర్, కిష్టాపూర్, అప్పాజీపల్లి, పోతన్‌శెట్టిపల్లి చౌరస్తా, సీతారాం తండా, ఏనుగండ్ల పాఠశాలలో టీపీటీఎఫ్ సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు.

నూతన కార్యవర్గం

హవేలిఘనపూర్, కొల్చారం: హవేలిఘనపూర్ మండల టీపీటీఎఫ్ అధ్యక్షుడిగా యాచం రాజశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడిగా రాజశేఖర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కొల్చారం మండల అధ్యక్షుడిగా లింగంగౌడ్, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ ఎన్నికైనారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి: తపస్


సభ్యత్వ నమోదు పత్రాన్ని అందిస్తున్న తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్

చిన్నశంకరంపేట: ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేట మండలంలోని ఆయా పాఠశాలల్లో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లా బాధ్యులు మాధవి, రఘుషా, ఆంజనేయులు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దశంకరంపేట: తపస్ పెద్దశంకరంపేట మండల నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఎల్లం, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా గుజ్జరి రవి, ప్రధాన కార్యదర్శిగా కాన్షీరాం ఎన్నికయ్యారు.

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం



ప్రతిజ్ఞ చేస్తున్న అశోక్‌గౌడ్, రామకృష్ణారావు, బలరాం

నర్సాపూర్, చిన్నశంకరంపేట, కౌడిపల్లి, మనోహరాబాద్: చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే వ్యాధులు దరిచేరవని నర్సాపూర్ పురపాలిక అధ్యక్షుడు అశోక్‌గౌడ్ అన్నారు. శుక్రవారం నర్సాపూర్ అల్లూరి సీతారామరాజు గిరిజన సంక్షేమ బాలుర గురుకుల కళాశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. కమిషనర్ రామకృష్ణారావు, ప్రిన్సిపల్ బలరాం, చిన్నశంకరంపేట మండలం శాలిపేట, ఖాజాపూర్ గ్రామాలలో మండల ప్రత్యేక అధికారి వెంకటయ్య పాల్గొన్నారు. అనంతరం వెంట్రావ్‌పల్లి, రామాయపల్లిలోని అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులను పరిశీలించారు. ఎంపీడీవో దామోదర్ పాల్గొన్నారు. కౌడిపల్లి ఎస్‌బీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద స్వచ్ఛతా కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ డీఈ అమరేశ్వర్, ఎస్‌బీఐ కౌడిపల్లి మేనేజర్ నర్సయ్య, కాళ్లకల్‌లో పంచాయతీ కార్యదర్శి రాజు గ్రామసభలో పలు తీర్మానాలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రోటోకాల్ ఉల్లంఘన

చేగుంట: ప్రభుత్వ కార్యక్రమాల్లో కాంగ్రెస్ ప్రోటోకాల్ పాటించడం లేదని భారాస నాయకులు ఆరోపించారు. శుక్రవారం చేగుంటలో భారాస మండలాధ్యక్షుడు నారాయణరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్ మాట్లాడారు. దుబ్బాకలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీలో కాంగ్రెస్ నాయకుడు ప్రోటోకాల్ పాటించకుండా స్టేజీపైకి రావడం తగదన్నారు.

టేక్మాల్‌లో భారాస నిరసన

టేక్మాల్: టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై చేసిన దాడికి నిరసనగా టేక్మాల్‌లో శుక్రవారం భారాస నాయకులు ఆందోళనకు దిగారు. పోలీస్ స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అల్లాదుర్గం సీఐ రేణుకారెడ్డికి ఫిర్యాదు చేశారు. భారాస మండలాధ్యక్షుడు వీరప్ప, సిద్దయ్య, సలీం తదితరులున్నారు.

ఎమ్మెల్యే ఇంటిపై దాడి తగదు

శివ్వంపేట: కాంగ్రెస్‌నాయకులు చిల్లర రాజకీయాలు మాని గోమారం గ్రామాభివృద్ధికి కృషి చేయాలని భారాస సీనియర్ నాయకులు యాదాగౌడ్, హన్మంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ నాయకుల ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం శిగోమారంలోని ఎమ్మెల్యే సునీతారెడ్డి నివాసంలో సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్.ఆంజనేయులు, వీరేష్, నర్సారెడ్డి తదితరులున్నారు.

నిందితులను శిక్షించండి

మెదక్: కొన్ని సంవత్సరాలుగా భూమిని సాగు చేస్తుండగా ఓ వ్యక్తి వచ్చి పంటలు ధ్వంసం చేశారని చేగుంట మండలం వల్లభాపూర్‌కు చెందిన బత్తుల లింగయ్య వాపోయారు. శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. 25ఏళ్లుగా సాగు చేసుకుంటుండగా ఓ వ్యక్తి వచ్చి పంట, హద్దులను ధ్వంసం చేశారన్నారు. ప్రశ్నిస్తే కుల బహిష్కరణ చేశారన్నారు. కలెక్టర్ తగిన న్యాయం చేయాలని కోరారు.

కళా ఉత్సవ్ మండల స్థాయి పోటీలు


కౌడిపల్లిలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కౌడిపల్లి, పెద్దశంకరంపేట: విద్యార్థినులు వివిధ రకాల కళల్లో ఉత్తమ ప్రతిభ చాటాలని కౌడిపల్లి ఎంఈవో బాలరాజు సూచించారు. శుక్రవారం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో కళా ఉత్సవ్ పోటీలు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పద్మజ, సజ్జద్ అలీ, పీడీలు పూర్ణచందర్, రమేశ్, ఉపాధ్యాయులు మాధవ్, శాంతికుమారి, బాలశేఖర్ ఉన్నారు. పెద్దశంకరంపేట జడ్పీ పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఎంఈవో వెంకటేశం, ప్రధానోపాధ్యాయుడు రాజేశ్వర్ ఉన్నారు.

కాళ్లకల్‌లో డీఎల్పీవో విచారణ

మనోహరాబాద్, న్యూస్‌టుడే: కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశాల మేరకు మండలంలో ఓ భూమి విషయంలో విచారణ చేపట్టినట్లు తూప్రాన్ డీఎల్పీవో యాదయ్య తెలిపారు. కాళ్లకల్ గ్రామంలోని నగరానికి చెందిన వసంతకుమారికి 5ఎకరాల భూమి ఉందని, కబ్జాల పాలవుతుందని ఆమె కలెక్టర్‌కు ఫిర్యాదు ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీవో లక్ష్మినర్సింలుతో కలిసి క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, బాధితుల నుంచి అభ్యంతరాలను సేకరించారు.

గురువులు, ఎంఈవోలకు సన్మానం

చేగుంట, శివ్వంపేట, అల్లాదుర్గం, కౌడిపల్లి: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు గ్రహీత మెతుకు పరమేశ్వర్‌రెడ్డితో పాటు ఉపాధ్యాయురాలు సమతను గ్రామస్థులు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. చేగుంట మండలం వల్లభాపూర్‌కు ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీ అయ్యారు, పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్థులు వారిని సన్మానించారు. శివ్వంపేట హనుమాన్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు అరుణకు జీఎంఆర్, వరలక్ష్మి ఫౌండేషన్ కార్యదర్శి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆచార్య దేవోభవ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును తూప్రాన్ టీజీఆర్జేసీ పాఠశాలలో ఇచ్చి సత్కరించారు. అల్లాదుర్గం నూతన ఎంఈవో ధనుంజయను మండలంలోని చేవెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు సన్మానించారు. కౌడిపల్లిలో ఎంఈవో బాలరాజును టీఎస్‌యూటీఎఫ్ సంఘం పక్షాన సన్మానించారు.

సార్వత్రిక విద్య గోడపత్రిక ఆవిష్కరణ

పాపన్నపేట, న్యూస్‌టుడే: మధ్యలో చదువు మానేసిన వారు సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సార్వత్రిక విద్య గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ పరీక్షలు రాయడానికి ఈ నెల 30 వరకు ఫీజు చెల్లించవచ్చన్నారు. ప్రధానోపాధ్యాయుడు మహేశ్వర్, కోఆర్డినేటర్ రియాజ్, ఉపాధ్యాయులు వెంకటేశం, అంజాగౌడ్, ప్రవీణ్ తదితరులున్నారు.

ఏఈవోలపై పనిభారం తగదు: టీఎన్జీవో

మెదక్ రూరల్: ఏఈవోలపై డిజిటల్ పనిభారం తగ్గించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. శుక్రవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో వ్యవసాయ విస్తరణ అధికారుల సర్వసభ్య సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. ఇదివరకే పంటల నమోదు కార్యక్రమం విస్తరణ అధికారులు విజయవంతంగా పూర్తి చేసి సాధారణ విధులు నిర్వర్తిస్తున్నారు. డిజిటల్ క్రాప్ సర్వే పేరుతో వేల ఎకరాల భూములను సర్వే చేస్తూ డిజిటల్ యాప్‌లో నమోదు అయ్యేలా చేయాలని ఆదేశాలు రావడంతో ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారని వాపోయారు. ఇతర రాష్ట్రాలకు భిన్నంగా విస్తరణ అధికారులపై ప్రభుత్వం అదనంగా పనిభారం మోపారని, వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్‌రెడ్డి, ప్రశాంత్, టీఎన్జీవో జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఫజలుద్దీన్ తదితరులున్నారు.

20 మందికి అప్రెంటీస్‌లుగా అవకాశం

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం వీఎల్ఆర్ ఫెసిలిటేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉద్యోగ మేళా జరిగింది. ఇందులో అప్రెంటీస్‌లుగా 20 మందికి అవకాశం దక్కింది. మేళాకు 39 మంది యువత హాజరవగా, వీరికి పలు పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన 20 మందిని ఎంపిక చేశారు. వారు అరబిందో ఫార్మాస్యూటికల్స్ ప్రొడక్షన్ విభాగంలో విధులు నిర్వర్తించనున్నారు. సమన్వయకర్త తిరుమల్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరగ్గా, వీ.ఎల్ఆర్ సంస్థ హెచ్ఆర్ ప్రవీణ్‌కుమార్ రెడ్డి, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ శరత్‌రెడ్డి, అధ్యాపకులు రాజు, క్రాంతికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వంటగ్యాస్ రీఫిల్లింగ్‌పై విచారణ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: దామరంచలోఇండేన్ గ్యాస్ గోదాంలో సిలిండర్ల నుంచి ఖాళీ సిలిండర్లలోకి రీఫిల్లింగ్ చేస్తుండగా ప్రజలు గురువారం పట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ ప్రణీతరెడ్డి శుక్రవారం గ్రామాన్ని సందర్శించి విచారణ జరిపారు.


మెదక్‌లో పుర అధ్యక్షులు చంద్రపాల్..


నర్సాపూర్‌లో ఆర్డీవో..


తూప్రాన్‌లో ప్రజాప్రతినిధులు..

లక్ష్మణ్ బాపూజీ బాట.. యువతకు ఆదర్శం

స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక రాష్ట్ర సాధనకు కృషి చేసిన అణగారిన వర్గాల ఆశాజ్యోతి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని పలు సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. శుక్రవారం ఆయన జయంతిని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ఇతర కార్యాలయాల్లో ఘనంగా నివాళులు అర్పించారు. మెదక్ పురపాలిక కార్యాలయంలో అధ్యక్షుడు చంద్రపాల్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్, కమిషనర్ జానకిరామ్ సాగర్ నివాళులు అర్పించారు. నర్సాపూర్‌లో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, డీఏవో సహదేవ్, చిన్నశంకరంపేట, కౌడిపల్లి, శివ్వంపేట మండలం దంతాన్‌పల్లి, రామాయంపేట పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జయరాములు, తూప్రాన్‌లో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మామిండ్ల కృష్ణ, పురపాలక వైస్ ఛైర్మన్ శ్రీనివాస్, పద్మశాలి సంఘం నాయకులు పాల్గొన్నారు. చేగుంట, పెద్దశంకరంపేట, రేగోడ్, అల్లాదుర్గం మండలాల్లోనూ నివాళి అర్పించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. – న్యూస్‌టుడే బృందం

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మనోహరాబాద్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని కూచారానికి చెందిన అర్కల రాంచందర్ కుమారుడు నిరంజన్ (27) శుక్రవారం వ్యక్తిగత పనిపై మేడ్చల్ వెళ్లాడు. రాత్రి తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో కాళ్లకల్ వద్ద జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందో పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని పోలీసులు వివరించారు.

స్నానానికి వెళ్లి యువకుడు..


అబ్దుల్

తూప్రాన్: స్నానానికి వెళ్లిన యువకుడు కాలుజారి చెరువులో మునిగి మృతి చెందాడు. తూప్రాన్ ఎస్ఐ శివానందం తెలిపిన వివరాలు.. మండలంలోని యావాపూర్‌కు చెందిన దూదేకుల అబ్దుల్ అలియాస్ అజ్జు(25) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గురువారం సాయంత్రం చెరువు వద్దకు వెళ్లి స్నానానికి దిగి కాలుజారి నీటిలో మునిగాడు. శుక్రవారం ఉదయం పలువురు అబ్దుల్ మృతదేహాన్ని చూసి కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదైంది.

చికిత్స పొందుతూ..

నిజాంపేట, రామాయంపేట: జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరిన ఏడేళ్ల బాలిక చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన నిజాంపేట మండల పరిధి చల్మెడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్థుల వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన బొమ్మెన కనకరాజు, లత దంపతుల కుమార్తె తనుశ్రీ(7) రెండో తరగతి చదువుతోంది. గురువారం జ్వరం రావడంతో స్థానిక ఆసుపత్రిలో చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది.

రక్తదాన శిబిరం

నర్సాపూర్: నర్సాపూర్ విష్ణు ఫార్మసి కళాశాలలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపల్ రమేశ్ ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమన్నారు. అపోహలు వీడి ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. నిర్వాహకులు అహ్మది భాను, సమన్వయకర్త రాజశేఖర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గాయిత్రి, భారత్ అభియాన్ కన్వీనర్ వనిత ఉన్నారు.

పర్యాటకంతో మానసికోల్లాసం



మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీనివాసరావు

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని డీఆర్డీవో శ్రీనివాసరావు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆర్ట్స్ క్యాంపస్‌లో నిర్వహించిన పర్యాటక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాల్లోని ప్రముఖ పర్యాటక క్షేత్రాలైన నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్, పోచారం అభయారణ్యం, ఏడుపాయల దుర్గామాత ఆలయం, చర్చి, మెదక్ ఖిల్లా చిట్కుల్ చాముండేశ్వరి దేవాలయం వంటి ప్రదేశాలు సందర్శించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి సమీకృత పాలనాధికారి కార్యాలయంలో పాలనాధికారి రాహుల్‌రాజు, అదనపు పాలనాధికారి వెంకటేశ్వర్లు కలిసి ప్రశంసా పత్రాలను అందజేశారు.

పురపాలికకు అదనపు ఆదాయం

తూప్రాన్, న్యూస్‌టుడే: ప్రజా సౌకర్యాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయిస్తూ పట్టణాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. తూప్రాన్ పురపాలికకు పెరిగిన పన్నులతో అదనపు ఆదాయం మరింత పెరిగింది. దాదాపు రూ. 1.16 కోట్లకుపైగా అదనపు వనరులు పన్నుల ద్వారా పురపాలికకు సమకూరుతుంది. ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పురపాలిక అధికారులు కొత్త విధానాల్లో పన్నులను విధించారు. దీంతో ఏడాదికి 1.36కోట్లు ఉన్న ఆదాయంతో పాటు కొత్త విధానంతో 2.55కోట్లకు చేరింది.

వాణిజ్య వ్యాపారులకు అధికం:

తూప్రాన్‌తోపాటు విలీన గ్రామాలు అల్లాపూర్, బ్రాహ్మణపల్లి, రావెల్లి పంచాయతీ పరిధిలోని పలు పరిశ్రమలు, వాణిజ్య వ్యాపార సంస్థలకు పంచాయతీగా ఉన్న సమయంలోనే ఉన్న పన్నులనే చాలా కాలం వరకు కొనసాగించారు. పురపాలికగా మారిన రెండేళ్లకు కొంతమేర పన్నులు పెంచారు. ఇటీవల కొత్త నిబంధన ప్రకారం పన్నులు మదింపు చేయడంతో దాదాపు అన్ని వ్యాపార వాణిజ్య సంస్థలకు పన్నులు 2 నుంచి 5 రెట్లు వరకు పెరిగాయి.

పెరిగిన పన్నులతో అభివృద్ధికి దన్ను


ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను పరిశీలిస్తున్న పురపాలిక సిబ్బంది

పురపాలికలో వార్డుల సంఖ్య: 16
ఇళ్ల సంఖ్య: 6630
గృహేతర వాణిజ్య వ్యాపారుల సంఖ్య: 584
పన్నులు పెంచక ముందు ఆదాయం: 1.36 కోట్లు
పెంచిన తర్వాత ఆదాయం: 2.55 కోట్లు

సవరణకు అవకాశం:

గతంలో భువన్ యాప్ ద్వారా పురపాలిక అధికారులు ప్రత్యేక సిబ్బందిని నియమించి ఇళ్లను వాణిజ్య వ్యాపార సంస్థలను కొలతలు వేయించారు. ఆ సమయంలో కొంతమేర కొలతల్లో వ్యత్యాసాలు వచ్చాయి. ఫలితంగా కొత్తగా పెరిగిన పన్నుల్లో కొంతమందికి అధిక పన్నులు వస్తుండగా మరికొంత మందికి తక్కువ వచ్చాయని అధికారులకు ఫిర్యాదులు వస్తున్నాయి.

అభ్యంతరాలు స్వీకరిస్తున్నాం:

– ఖాజా మొయినుద్దీన్, పురపాలిక కమిషనర్

పురపాలికలో కొత్త పన్ను విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చాం. పన్నులు పెంచిన సమయంలో యజమానులకు తాఖీదులు అందజేశాం. ఏవైనా అభ్యంతరాలు ఉంటే పురపాలిక సిబ్బంది ఇచ్చిన తాఖీదులతో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించి ప్రస్తుతం ఉన్న విధంగా సరి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.